




మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జేసీ మౌర్య



చెత్తాచెదారంతో నిండి ఉన్న నీటి ట్యాంకు



సుంకేశ్వరిలో అతిసార

- మూడేళ్ల బాలిక మృతి
- 70 మందికి అస్వస్థత
- కదిలివచ్చిన అధికార యంత్రాంగం
- 24/7 వైద్యసేవలు అందిస్తామన్న ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

మంత్రాలయం, జూలై 15: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార విజృంభించింది. తాగునీరు, అపరిశుభ్రత కారణంగా గత నాలుగు రోజుల నుంచి గ్రామ ప్రజలు వాంతులు, విరేచనాలతో ఆదోని, ఎమ్మిగనూరు, రాయచూరు వంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున బోయ ఈరన్న, అంజలి దంపతుల కూతురు జ్యోతి (3) అనే చిన్నారి అతిసారతో మృతి చెందింది. దీంతో అధికారులు అప్రమత్తమై సుంకేశ్వరి గ్రామానికి పరుగులు పెట్టారు. గ్రామ సచివాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇందులో గుడికల్ ముద్దయ్య, తులసి దంపతుల కుమారుడు శివ (2) అనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామంలో మురికి కాలువలు చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై మురుగు నీరు చేరడంతో అపరిశుభ్రత నెలకొంది. తాగునీరు పంపింగ్ చేసే బోర్లు కలుషితం కావడంతో అతిసార ప్రబలినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నీటి శాంపుల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన ఆయా శాఖల అధికారులపై ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్యోతి అనే మూడేళ్ల చిన్నారి అతిసారతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. జేసీ, ఆదోని సబ్ కలెక్టర్‌లతో పాటు డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, డీపీవో నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావులు జ్యోతి తల్లిదండ్రులు ఈరన్న, అంజలిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.



సుంకేశ్వరిలో అపరిశుభ్రంగా ఉన్న రోడ్లు



అతిసారతో మృతి చెందిన మూడేళ్ల చిన్నారి జ్యోతి (ఫైల్)

సుంకేశ్వరికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి

మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, డీఎల్‌డీవో నాగరాజరావు, డీఎల్‌పీవో నూర్జహాన్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, మండల వైద్యాధికారులు గోవిందమ్మ, సురేష్ సోమవారం చేరుకున్నారు. తాగునీటి వ్యవస్థను, మురికి కాలువలను పరిశీలించారు. శ్మశానం దగ్గర వేసిన బోరు నుంచి తాగునీరు సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. మురికి కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణకు హైపోద్రావణాన్ని పిచికారి చేయాలని ఆదేశించారు. సచివాలయంలో వైద్యసేవలు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. వీరి వెంట వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవి, సర్పంచ్ ముకురన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.

తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ



బాలిక మృతిపై మంత్రి భరత్ విచారం

కర్నూలు అర్బన్: సుంకేశ్వరి గ్రామంలో అతిసారతో చిన్నారి జ్యోతి మృతిచెందిన సంఘటనపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ విచారం వ్యక్తం చేశారు. అతిసార ప్రబలడంతో ఎందరో అనారోగ్యానికి గురయ్యారని, అలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అతిసార ప్రబలకుండా గ్రామాల్లో బ్లీచింగ్ చేయడంతో పాటు ప్రజలు శుభ్రం పాటించేందుకు అవసరమైన అవగాహన కల్పించాలన్నారు.

చిన్నారి కుటుంబానికి పరామర్శ

సుంకేశ్వరి గ్రామంలో అతిసారతో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరామర్శించారు. పరిశుభ్రతపై దృష్టి సారించి ఉచితంగా 24/7 ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. పరిస్థితి విషమించే వరకు ఆర్‌డబ్ల్యూఎస్, సర్పంచ్, వైద్యసిబ్బంది ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. వారం రోజులపాటు కంటికి రెప్పల్లా పిల్లలను కాపాడాలని, సచివాలయాన్ని ఏడు రోజులు ఉచిత వైద్యానికి ఉపయోగించుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు 108, 104 వాహనాలను అందుబాటులోకి తెచ్చి విషమంగా ఉన్న ముద్దయ్య, తులసి దంపతుల కుమారుడు శివకు మెరుగైన వైద్యచికిత్సలు అందించారు.

టీడీపీ నాయకుల పరామర్శ

టీడీపీ నాయకుడు ఎన్. రాఘవేంద్రరెడ్డి గ్రామానికి చేరుకుని మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈయన వెంట నాయకులు రోగప్ప, నాగప్ప, టీడీపీ ఉన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి



చికిత్స పొందుతున్న బాలుడు శివ

గంజాయిపై ఉక్కుపాదం

- స్త్రీ, శిశు రక్షణకు ప్రాధాన్యం
- బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 15: నంద్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయడంతోపాటు స్త్రీ, శిశు రక్షణకు పెద్దపీట వేస్తామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అధిరాజ్‌సింగ్ రాణా 2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల ఎస్పీగా వచ్చారు. ముందుగా ఆయన అనంతపురం జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా, అసిస్టెంట్ ఎస్పీగా పని చేశారు. రంపచోడవరంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో చొరవచూపారు. నర్సీపట్నంలో ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించి నేర నియంత్రణలో భాగంగా తనదైన శైలిలో గంజాయి, అక్రమ రవాణా, వివిధ రకాల నేరాలపై ఉక్కుపాదం మోపి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. నంద్యాలలో బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డీజీపీలు తనపై నమ్మకంతో నంద్యాల ఎస్పీగా పంపారన్నారు. అప్పగించిన బాధ్యతలను వందశాతం సమర్థంగా నిర్వర్తించి జిల్లా ప్రజలకు, పోలీస్‌శాఖకు మంచిపేరు తెస్తానని పేర్కొన్నారు. మహిళలపై జరిగే నేరాల నిర్మూలన, మహిళల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. నేర నియంత్రణ తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సహకారంతో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. అలాగే పోలీసుల సంక్షేమంపై దృష్టి సారిస్తానని, పోలీస్ అధికారులు, సిబ్బంది ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే ప్రసక్తేలేదన్నారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో మీడియా కూడా సహకారం అందించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా కోరారు.




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

ఉపాధి వేతన వృద్ధి రేటును పెంచండి

- మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 15: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సగటు దినసరి కూలీ 300 రూపాయలకు చేరుకునేలా చూడాలని కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, సంబంధిత ఏపీడీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో ప్రజా సమస్య పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ వేతనం 239 రూపాయలకు మించడం లేదని కేంద్ర ప్రభుత్వం 300 మంజూరుచేసినప్పటికీ .... ఆ మేర పనులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ నెలాఖరులోగా ఉపాధి సగటు దినసరి కూలి 250 రూపాయలు వేతనాన్ని అధిగమించాలని అధికారులను ఆమె ఆదేశించారు. 76 లక్షల పనిదినాల లక్ష్యానికి గాను 46 లక్షల పనిదినాలు మాత్రమే సాధించామని అన్నారు. పని అడిగిన వారందరికీ అవకాశం కల్పించి .. కోటి పని దినాలు కల్పించేలా డ్వామా అధికారులు, ఎంపీడీఓలు పనిచేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన వినతులను వేగవంతంగా నాణ్యతతో పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం) కార్యక్రమంలో అర్జీలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సోలార్ పనులను అడ్డుకున్న గ్రామస్థులు

- కందికాయపల్లిలో రైతుల ఆందోళన

పాణ్యం, జూలై 15 : మండలంలోని కందికాయపల్లిలో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన సోలార్ పనులను సోమవారం గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నారు. సోలార్ పరిశ్రమతో కోల్పోయిన తమ భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, గ్రామానికి అందించాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంస్థ నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడేళ్లుగా గ్రామంలో సోలార్ పనులు చేస్తున్నారుగాని సౌకర్యాలు అందించడం లేదని అన్నారు. సోలార్ పరిశ్రమ నిర్మాణంతో దాదాపు 600 ఎకరాల సాగు భూములు కోల్పోయామన్నారు. పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారన్నారు. గ్రామంలోని వందలాది పశువులు, గొర్రెలు, మేకలకు సోలార్ నిర్మాణంతో పశుగ్రాసం, తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. సోలార్ పరిశ్రమ ద్వారా గ్రామ యువకులకు ఉపాధి లేదన్నారు. అసైన్డ్ కాని సాగు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పట్టాలు లేని సాగు భూములకు ఎకరాకు రూ.9 లక్షలు ఇవ్వాలని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, సోలార్ వీధి దీపాలు, మినరల్ వాటర్‌ప్లాంటు, ఆసుపత్రి, అంబులెన్స్ సౌకర్యం, పశువుల ఆసుపత్రి, రాత్రి పూట గస్తీకి సెక్యూరిటీ ఏర్పాటు, గ్రామ రస్తాలు, తాగునీటి కొళాయిల ఏర్పాటు, దోబీ ఘాట్లు, పశువులకు నీటి తొట్లు, పశుగ్రాసం, దేవాలయాలలో పూజారుల ఏర్పాటు, యువకులకు ఉపాధి, క్రీడా మైదానం వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులను కల్పించని పక్షంలో పనులను అడ్డుకుంటామని సంస్థ నిర్వాహకులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.



సోలార్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు, రైతులు

కుక్కలను నియంత్రించాలి

- పట్టుకోకుండానే రికార్డుల్లో చూపుతున్నారు
- ప్రస్తుతం ఉన్న ఏజెన్సీని రద్దు చేయాలి
- సర్వసభ్య సమావేశం కార్పొరేటర్లు
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం
- హాజరైన ఎమ్మెల్యేలు గౌరు చరిత, దస్తగిరి
- 15 అజెండాలకు ఆమోదం

కర్నూలు(న్యూసిటీ), జూలై 15: నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కుక్కల నియంత్రణపై రగడ నడిచింది. మూడేళ్ల కాలంలో ఎన్ని కుక్కలను పట్టుకున్నారో చెప్పాలని అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. కుక్కలను పట్టుకోకుండా రికార్డుల్లో చూపుతున్నారని మండిపడ్డారు. శనివారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొట్ట మొదటి కౌన్సిల్ సమావేశానికి పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరిలు హాజరయ్యారు. మేయర్ బీవై రామయ్య, కమిషనర్ ఎ.భార్గవతేజలు వారిని సన్మానించారు. అనంతరం సమావేశంలో 15 అజెండాలకు ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనులకు నగర పాలక సాధారణ నిధుల నుంచి రూ.9.19 కోట్లు ఖర్చు చేయడానికి పాలకవర్గం పచ్చ జెండా ఊపింది. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో జరిగే పనులకు సంబంధించిన సమాచారం స్థానిక కార్పొరేటర్లకు ఇవ్వాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై కార్పొరేటర్ల ఆగ్రహం..

టౌన్ ప్లానింగ్ అధికారులపై కొందరు కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారని స్వయంగా కార్పొరేటర్‌గా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని క్రాంతికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల నిర్లక్ష్యం సమాధానం ఇవ్వడం సబబుకాదన్నారు. 50వ వార్డు రైతుబజార్ వద్ద 127,128 సచివాలయాల పక్కనే రోడ్డును ఆక్రమించుకుని కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేశారని, కార్పొరేటర్ షేక్ అహ్మద్, శిల్పాటౌన్‌షిప్‌లో 60 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురైందని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. 17వ వార్డులో రెండేళ్ల క్రితం థీమ్ పార్కు పనులు ప్రారంభించారని, ఎప్పుడు పూర్తి చేస్తారని టీడీపీ కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 21వ వార్డులో వీధి దీపాలు వేయించాలని ఎన్ని సార్లు అడిగినా స్పందించడం లేదని కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి అన్నారు. 39,40 వార్డుల్లో ప్రారంభించిన పనుల్లో కాలయాపన చేస్తున్నారని 39,40 వార్డుల కార్పొరేటర్లు సాంబశివ, విక్రమసింహారెడ్డి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. కొండారెడ్డినగర్, మమతానగర్‌లో లక్ష్మీపురంలో పార్కు, టాయిలెట్లు నిర్మాణం ఇంకా పూర్తికాలేదని కార్పొరేటర్ నారాయణరెడ్డి తెలిపారు.





కుక్కల నియంత్రణపై రగడ...

నగరంలో కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను పట్టుకోకున్నా పట్టుకున్నట్లు, ఆపరేషన్ చేయకుండా చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారని 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ సమావేశం దృష్టికి తెచ్చారు. కుక్కలను పట్టుకెళ్లే ఏజెన్సీని రద్దు చేసి మరో ఏజెన్సీకి అప్పజెప్పాలని 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ పరమేష్ డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు అంటే అధికారులకు లెక్కలేకుండా పోతోందని 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 52 వార్డులలో మూడేళ్ల కాలంలో ఎన్ని కుక్కలను పట్టుకున్నారు.. ఎన్నింటికి ఆపరేషన్ చేశారు.. వాటి వివరాలు వార్డుల వారీగా ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకులు అరుణ, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ నాగరాజు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి, ఈఈలు శేషసాయి, షాకీర్ హుసేన్, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్, ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను పెంచాలి..

కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని మూడు వార్డుల్లో పారిశుధ్య కార్మికులను పెంచాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి. గతంలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదు. వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారు. పార్కులను కబ్జా చేస్తున్నారు..వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి..

గత మూడేళ్లలో నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తాం. పాణ్యం 16 వార్డులలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విస్తరించిన కాలనీలలో రోజు విడిచి రోజు తాగునీరు వస్తోంది. అది కూడా రాత్రిపూట ఇస్తున్నారు. గుంతలు పడిన రోడ్లను పూడ్చడానికి చిప్స్ వేయాలి. 19వ వార్డులోని కొన్ని పార్కులు కబ్జాకు గురయ్యాయి. వాటిని వెంటనే నగర పాలక సంస్థ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. ఇదే వార్డులోని ఇండోర్ స్టేడియం ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం వల్ల వారు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. వెంటనే ఆ వ్యక్తుల టెండరును రద్దు చేయండి. 16 వార్డులలో ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ కబ్జా చేశారు. ఇన్నాళ్లు ఒక లెక్క..ఇప్పుడు ఇంకో లెక్క..ఎవరైనా కబ్జా చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. హంద్రీనది, కేసీ కెనాల్‌లో ముళ్లకంపలు, గుర్రపు డెక్కాను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే





మీ ఇళ్ల వద్ద...మీ కార్యాలయం ఎదుట పడేస్తాం

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు. చెట్ల కొమ్మలు కొట్టి ఎందుకు అక్కడే పడేస్తున్నారు. డంప్ యార్డుకు తరలించకుంటే చర్యలు తీసుకుంటాం. లేని పక్షంలో మీ ఇళ్ల వద్ద...మీ కార్యాలయం ముందు తీసుకువచ్చి పడేస్తాం.

- భార్గవతేజ, కమిషనర్

టీజీ వెంకటేశ్‌ను కలిసిన కేశవరెడ్డి



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేశవరెడ్డి

కర్నూలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి బీజేపీలో చేరి రాజకీయ అరంగ్రేటం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధినేత్రి పురందేశ్వరితో సమావే శమైన సంగతి తెలిసిందే. సోమవారం ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో కేశవరెడ్డి భేటీ అయ్యారు. విద్యా రంగానికే పరిమితం అయిన ఆయన రాజకీయాల్లో అడుగు పెట్టాక టీజీని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బీజేపీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని బీజేపీ నాయకులు కేశవరెడ్డి పేర్కొన్నారు.

భూ తగాదాలే గుండమ్మను బలి తీసుకొన్నాయి

- ఆరుగురు నిందితుల అరెస్టు
- విలేఖరులతో డీఎస్పీ శివ నారాయణ స్వామి
- నాగనాథనహళ్ళిలో కొనసాగుతున్న పికెటింగ్

ఆదోని రూరల్, జూలై 15 : భూ తగాదాల కారణంగానే ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన మాదిగ గుండమ్మను ప్రత్యర్థులు బలి తీసుకున్నారని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... సర్వే నెం. 500డిలో నాలుగు ఎకరాల స్థలాన్ని గ్రామానికి చెందిన తిరుమలమ్మ వద్ద గుండమ్మ 2019లో కొనుగోలు చేసింది. అయితే ఆ భూమి తమకు కూడ చెందుతుందని తిరుమలమ్మ బంధువు రాఘవరెడ్డి, అతని కొడుకు శ్రీధర్‌రెడ్డి గుండమ్మ వద్ద ఘర్షణ పడుతూ వచ్చారు. ఈనెల 12న శుక్రవారం గుండమ్మ దత్త పుత్రుడు కిశోర్, సహచరుడు పురుషోత్తంరెడ్డితో కలిసి గుండమ్మ పొలానికి వెళ్లింది. అక్కడ జరిగిన ఘర్షణలో రాఘవరెడ్డితోపాటు సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, దాసరి గోవిందు తదితరులు కోపోద్రిక్తులయ్యారు. శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్‌తో గుండమ్మను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సహచరుడు పురుషోత్తంరెడ్డిని సైతం తీవ్రంగా కొట్టారు. నిందితులు ఆరుగురిని శిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద సోమవారం అదుపులో తీసుకొని కోర్టుకు తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో సీఐలు నీరంజన్‌రెడ్డి, గోపి, ఎస్.ఐ శ్రీనివాసులు, పీరయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఈ నెల 12న జీవో నెం.82ను జారీ చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు హెల్త్ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రతిసారి రూ.2లక్షల వైద్యసేవలు అందుతాయని అన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. www.cfms.ap.gov.int వెబ్‌సైట్ ద్వారా రూ.1250లు చెల్లించి వచ్చే సంవత్సరం మార్చి 31వరకు హెడ్‌ఆఫ్ అకౌంటు 8342-00-120-01-03-001-001 పద్దుకు డీడీవో కోడ్-2703-0802-003 ద్వారా లబ్ధి పొందాలన్నారు.

జత చేయాల్సిన కాపీలు: ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీం దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కర్నూలు కార్యాలయంలో అందజేయాలి.

వీడని మిస్టరీ

తొమ్మిది రోజులైనా లభ్యంకాని వాసంతి ఆచూకీ



ముచ్చుమర్రిలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర మహిళ సంఘం జనరల్ సెక్రటరీ

పగిడ్యాల, జూలై 15: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. బాలిక కోసం పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తొమ్మిది రోజులు కావస్తున్నా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడం, అనుమానితులు పొంతనలేని సమాచారం ఇస్తుండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం గాలింపు చర్యలకు ఆటకంగా మారింది. దీంతో పోలీస్‌లు స్టేషన్‌కే పరిమితం కావల్సిన పరిస్థితి నెలకొంది. తొమ్మిది రోజులైన తమ బిడ్డ ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తల్లిదండ్రుల రోదనలు మిన్నట్టాయి.

బాలిక కుటుంబానికి పరామర్శ...

వాసంతి కుటుంబ సభ్యులను సోమవారం వైసీపీ మహిళా సంఘం జనరల్ సెక్రటరీ శశికళ, లీగల్ అడ్వైజర్ శ్రీదేవి తదితరులు పరామర్శించారు. బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వాసంతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం రాష్ట్ర హోంమంత్రి ప్రకటన

నందికొట్కూరు, జూలై 15: తొమ్మిది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత అమరావతిలో ప్రకటించారు. ఈ నెల 7వ తేదీన పార్కులో ఆడుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయిన సంగెం వాసంతి(9)ని కనిపించకుండా పోయిందని ఆమె తెలిపారు. చిన్నారిని అతి క్రూరంగా గొంతు నులిమి చంపి బండరాయి కట్టి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంలో పడేశారని ప్రాథమిక విచారణలో తేలిందని ఆమె అన్నారు. అయితే బుధవారం హోంశాఖ మంత్రి అనిత ముచ్చుమర్రి గ్రామానికి రానున్నట్లు తెలుస్తోంది. వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిత్యావసర సరుకులు అందజేసిన రెవెన్యూ అధికారులు

వాసంతి కుటుంబానికి డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్ నిత్యావసర సరుకులు అందజేశారు. బాలిక తల్లిదండ్రులకు 50 కేజీల బియ్యం, చక్కెర, బ్యాళ్లు అందజేశారు. అనంతరం బాలిక కుటుంబాన్ని ఎంఈవో సుభాన్, మురళీమోహన్‌రెడ్డిలు పరామర్శించారు. వాసంతి అక్క జ్యోతిని పగిడ్యాల కస్తూర్బాగాంధీ, తమ్ముడు మహేష్‌ను గురుకుల పాఠశాలలో చేర్పించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించి చదివించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మత్స్యకారులకు శుభవార్త

జీవో నెం.144, 217 రద్దు చేసిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 15: మత్స్యకారులకు శరాఘాతంగా మారిన 144, 217 జీవోలను తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీపై డీజిల్ అందించే పథకాన్ని కూడా తిరిగి పునఃప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10 కోట్లు మంజూరు చేయడంపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెరువుల్లో చేపల వేటను సాగిస్తున్న మత్స్యకారుల కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడేలా నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో మత్స్య కార్మికులు ఆ జీవోలను రద్దు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. అయినా గత వైసీపీ ప్రభుత్వం వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ జీవోలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం తీసుకున్నారు. దీంతో మత్స్యకార్మికుల సంక్షేమ సంఘం రాయలసీమ ప్రతినిధి వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), జూలై 15: జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కోరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీఎంహెచ్‌వో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రాలయం నియోజకవర్గం సుంకేశ్వరి గ్రామంలోని ప్రజలు కలుషిత నీరు తాగి అతిసార బారిన పడ్డారని తెలిపా. వీరిలో 25 మంది తీవ్ర అనారోగ్యంతో ఆదోని ఏరియా ఆసుపత్రిలో, మరి కొందరు ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని అన్నారు. వీరిలో మూడేళ్ల చిన్నారి కోలుకోలేక మృతి చెందడం బాధాకరమన్నారు. గ్రామంలో వారం రోజుల నుంచి ప్రజలు అతిసారతో బాధపడుతున్నప్పటికీ ఆరోగ్యశాఖ సరైన తీరులో స్పందించడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్‌వోకు విషయాన్ని వివరించామని తెలిపారు.

సహకార సంఘాలను బలోపేతం చేయండి

సహకార సంఘాల సంక్షేమ సంఘం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 15: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘాల సంక్షేమ సంఘం యూనియన్ అధ్యక్షుడు రామక్రిష్ణ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలం నుంచి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. దీనికి తోడు బదిలీల ప్రక్రియ చేపట్టి తమ గుప్పిట్లోనే ఉద్యోగులను బంధించేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను విన్నవిస్తామని తెలిపారు.

కారు మబ్బుల గుంపులు

సుంకేసుల జలాశయంపై కమ్ముకున్న మేఘాలు

కర్నూలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల జలాశయం మీద నల్లని మేఘాలు కమ్ముకు న్నాయి. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో జలాశయంపైన కారుమేఘాలు పరదలా కప్పుకున్నాయి. దట్టమైన మేఘాలతో ఆకాశం వర్షించేందుకు సిద్ధంగా కనిపించింది. ఈ అద్భుత దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.



డెంగీ ప్రబలకుండా చర్యలు


బైర్లూటి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల గదుల్లో మలాథియన్ ద్రావణాన్ని పిచికారి చేయిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరు రూరల్, జూలై 15: సీజనల్ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. వారు సోమవారం బైర్లూటి గిరిజన గూడెంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య సిబ్బంది తో కలిసి డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా తప్పకుండా దోమతెరలు వాడాలని, డెంగీ బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చాణక్య, సీహెచ్‌వో దీపికాబాయి, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులపై అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు, జూలై 15: రైతులు నకిలీ పురుగు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏవో పవన్‌కుమార్ అన్నారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరు రేగడ గూడూరు గ్రామాలలో ఆత్మకూరుకు చెందిన కొందరు నకిలీ పురుగు మందులు, గుళికలు ఎలాంటి బిల్లులు లేకుండా లైసెన్సు లేకుండా వాహనాల్లో తెచ్చి అమ్ముతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. రైతులకు మోస పూరిత మాటలు చెప్పి నకిలీ మందులను అంటగడుతున్నారని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సచివాలయంలో చంద్రబాబు, పవన్ ఫొటోలు


మిట్టకందాల గ్రామంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్ర పటాలను అందిస్తున్న నాయకులు

పాములపాడు, జూలై 15: మండలంలోని మిట్టకందాల గ్రామంలోని సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను అందించారు. సోమవారం కూటమి నాయకులు హరిప్రసాద్, నాగేశ్వరరావు, భావనరాములు గ్రామంలోని సచివాలయం సిబ్బందితో మాట్లాడి తమ నాయకుల చిత్ర పటాలను కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ బాబు రాకతో ఆంధ్రప్రదేశ్‌కు మంచిరోజులు వచ్చాయని, దోపిడీ పాలనదారులు నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందని మంచి విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు పాలనలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంజన్న, వినోద్, నాగశ్రీను, ప్రసాద్, బుడ్డన్న, బ్రహ్మయ్య, బుజ్జి, పరుశురామ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు

పాములపాడు, జూలై 15: వర్షాలు కురువాలని, పంటలు బాగ పండాలని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాములపాడులో సోమవారం రైతులు, గ్రామపెద్దలు, కలిసి గ్రామంలోని శివాలయంలో శివునిక భక్తి శ్రద్ధలతో స్థానిక బావుల నుంచి బిందెలతో నీటిని భుజాన పెట్టుకొని తడి బట్టలతో ఊరేగింపుగా తీసుకొచ్చిన జలాలతో శివుడ్ని అభిషేకించారు. కార్యక్రమంలో వంద మందికి పైగా రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు బాధ్యతతో పెంచాలి


కూలీతో మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్

బండి ఆత్మకూరు, జూలై15: గ్రామాల్లో రోడ్ల వెంట, గట్ల వెంట నాటిన మొక్కలను బాధ్యతతో పెంచాలని అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ సూచించారు. సోమవారం బండిఆత్మకూరు, కరిమద్దుల గ్రామాల మధ్య మొక్కలను ఆయన పరిశీలించారు. అక్కడ కూలీలతో మాట్లాడారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో ఏపీఓ వసుధ, సిబ్బందితో సమావేశం అయ్యారు. రికార్డులు పరిశీలించి, నిర్వహణ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ వరదరాజులు, టీఏ ప్రియస్వప్న, ఎఫ్ఏ నాగరాజు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చిన్న సరిగెత్తు

ఆత్మకూరు రూరల్, జూలై 15: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో చిన్నసెరిగెత్తు వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి పీర్ల స్వాములకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

నందికొట్కూరు, జూలై 15: పట్టణంలోని బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత లోపించిందని, అధిక శాతం నీళ్లతో కూడిన ఎగ్ కర్రీని విద్యార్థులకు వడ్డిస్తున్నారని, అలాగే వంటశాల పరిసరాల్లో పరిశుభ్రత లోపించిందన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో 10వ వార్డు ఇన్‌చార్జి వి.ఆర్.శ్రీను, టీడీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, లాలుప్రసాద్‌లు పాల్గొన్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు, జూలై 15: పశుపోషణలో పాడిరైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాకులు డాక్టర్ అరుణ పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని ముష్టేపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పాడిగేదెలకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రధానంగా పశువులకు గర్భధారణ చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాడిరైతులు పశుపోషణలో పశువుల వైద్యుల సూచనలు తప్పక పాటించాలని చెప్పారు. ప్రత్యేకించి పశుసంవర్ధక శాఖ ద్వారా అమలయ్యే పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవీబాయి, పశువైద్యులు రవిశంకర్, అశోక్‌కుమార్, భువనేశ్వరీ, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

ఆత్మకూరులో భారీ వర్షం

- లోతట్టు కాలనీలు జలమయం

ఆత్మకూరు, జూలై 15: ఆత్మకూరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం రాత్రివరకు అడపాదడపా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ఏకలవ్యనగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీల్లోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పట్టణంలోని కప్పలకుంట, అప్పారావువీధి, పోస్టాఫీసు ఏరియా, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో జనం అసౌకర్యానికి లోనయ్యారు. ఆత్మకూరు శివార్లలోని పడేవాగు, భవనాశి నదిలో నీటి ప్రవాహం కొనసాగింది.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ముఖ్యంగా సంగమేశ్వరం, కొత్తపల్లి, పాతమాడుగుల, శివపురం, సింగరాజుపల్లి, గువ్వలకుంట్ల, కొక్కెరంచ, ముసలిమడుగు, నందికుంట తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షం వరి సాగు చేసిన రైతులకు మేలు చేసినప్పటికీ ఆరుతడి పంటలైన మొక్కజొన్న, మినుము, కంది, జొన్న, ఉల్లి తదితర పంటలు సాగు చేసిన రైతుల కు మాత్రం ఈ వర్షం అంతగా మేలు చేయలేదని రైతులు పేర్కొంటున్నారు. పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల పంటలకు ఎదుగుదల లేక దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఆత్మకూరులోని తిక్కయ్యస్వామి దర్గా వద్ద నిలిచిన వర్షపు నీరు


గువ్వలకుంట్ల పంట పొలాల్లో నిల్వ చేరిన వర్షం నీరు

నిందితులను కఠినంగా శిక్షించాలి

పగిడ్యాల, జూలై 15: కొత్త ముచ్చుమర్రి మజార గ్రామమైన ఎల్లాలకు చెందిన వాసంతి అనే బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. పడమర ప్రాతకోట బస్టాండ్ ఆవరణలో సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు.

- హత్యకు గురైన వాసంతి ఆచూకీ కనిపెట్టాలని పగిడ్యాల బస్టాండ్ ఆవరణలో వాల్మీకి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. పోలీసులు త్వరితగతిన విచారణ చేసి బాలిక కుటుంబాని ఆదుకోవాలన్నారు.

నందికొట్కూరు: పగిడ్యాల మండలం పాతముచ్చుమర్రి గ్రామానికి చెందిన సంగెం వాసంతి కనిపించకుండా పోయి 9 రోజులు అవుతున్నా జాడ తెలపడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీఎం నాయకుడు భాస్కర్‌రెడ్డి, పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ విమర్శించారు. సోమవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పోలీసుల అదుపులోనే మైనర్లు, వారి తల్లిదండ్రులు ఉన్నప్పటికీ కేసును చేధించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. నిందితులు పోలీసు కస్టడీలో ఉన్నప్పటికీ నిజానిజాలు వెలికి తీయడంలో పోలీసులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిదులు ప్రతిరోజు బాధిత కుటుంబాన్ని పరామర్శించడం తప్పా చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): హత్యకు గురై మృతి చెందిన వాసంతి(8) కుటుంబానికి న్యాయం చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని సోమవారం ప్రజాదర్బారులో కలెక్టర్ రాజకుమారికి జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట వాసంతికి న్యాయం జరగాలని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల విద్యార్థి యువజన, ప్రజా సంఘాల నేతలు రామినేని రాజునాయుడు, ఓబులేసు, రియాజ్, జయరాజు, మధుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో 8ఏళ్ల బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదిత్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌నాయుడు, శ్రీదీపా మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణ, వాల్మీకి సంఘం నాయకులు పాల శివ, మండ్ల మల్లికార్జున, వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు జనార్ధన్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ముచ్చుమర్రి గ్రామంలో బాలిక వాసంతి హత్యను నిరసిస్తూ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో స్థానిక గౌడ్‌సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించినప్పుడే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావదని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శివప్రసాద్, రామకృష్ణ, శ్రీహరి, రాఘవేంద్ర ఉన్నారు.


పగిడ్యాల బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న వాల్మీకి నాయకులు



సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా


ఆత్మకూరులో ధర్నా చేస్తున్న విద్యార్థులు


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు భాస్కర్‌రెడ్డి

కౌలు కార్డులు అందేలా చూడాలి: ఏడీఏ

కొత్తపల్లి, జూలై 15: కౌలు రైతులకు కౌలుకార్డులు త్వరితగతిన అందజేయాలని ఆత్మకూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఆంజనేయ, కొత్తపల్లి తహసీల్దార్ తిరుపతయ్యకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌తో గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతులకు త్వరితగతిన కౌలుకార్డులు అందజేస్తే వారు బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతారన్నారు. ప్రధానంగా సకాలంలో వర్షాలు పడుతుండటం వల్ల రైతులు పంట పెట్టుబడులకు అవసరమయ్యే రుణాలు పొందేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఏవోకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, రెవెన్యూ అధికారులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు

వెలుగోడు, జూలై 15: మండలంలోని కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి ఏవో పవన్‌కుమార్‌లు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వెలుగోడు మండలానికి 550 కౌలు రైతు గుర్తింపు కార్డులు టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గుర్తింపు కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా రాయితీపై విత్తనాలు ఎరువులు, పొందవచ్చన్నారు. పంట నమోదు చేసుకుని పంటల బీమా పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇవీఆర్‌వోలను సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు.

కౌలు పత్రాలు అందించాలి

పాములపాడు, జూలై 15: మండలంలోని రైతులకు త్వరితగతిన కౌలు పత్రాలు అందించాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయక సంచాలకులు ఆంజనేయ, తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. సోమవారం పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డితో కలిసి వీఆర్‌వోలతో కౌలు పత్రంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 750 మంది కౌలు పత్రాలు అందించాల్సి ఉండగా నేటికీ 135 మందికే అందించామని, గ్రామాలలోని వ్యవసాయ సంచాలకుల ద్వారా త్వరగా పంపిణీ చేయాలని సూచించారు.

ఆత్మకూరు: కౌలుకు పంటలను సాగుచేసే రైతులు తప్పనిసరిగా కౌలు పంటసాగు హక్కు కార్డులను పొందాలని మండల వ్యవసాయశాఖాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం నందు కౌలు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసే రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సిబ్బంది నాగరాజు, రవిగౌడ్, సావిత్రీబాయి ఉన్నారు.


కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయులు


ఆత్మకూరులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

వర్షం కోసం శివాలయాల్లో అభిషేకాలు

- శ్రీశైలం నుంచి నడిచి వచ్చిన శునకం
- శునకానికి పూజలు చేస్తున్న భక్తులు

నందికొట్కూరు, జూలై 15: వర్షాలు కురవాలంటూ శ్రీశైలంలోని పాతళగంగ నుంచి జలాలను రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు తీసుకువచ్చి పట్టణంలోని ప్రతి శివాలయంలో అభిషేకాలు చేశారు. నందికొట్కూరులో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారి నందికొట్కూరు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు శ్రీశైలానికి వెళ్లి అక్కడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకొని ఆ తర్వాత పాతాళగంగ నుంచి జలాలను తీసుకొని పాదయాత్రగా నందికొట్కూరుకు చేరుకుంటారు. అలాగే ఈ సారి కూడా వర్షాలు కురవకపోవడంతో 18 మంది రైతులు పాతాళగంగ నుంచి జలాలను తీసుకొని పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో సాక్షిగణపతి వద్ద వారు దర్శనం చేసుకొని కాసేపు సేదతీరి...అక్కడి నుంచి నందికొట్కూరుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఒక శునకం వారితో పాటు మార్గమధ్యమంలోని అన్ని దేవాలయాలను దర్శించుకుంటూ ఆదివారం సాయంత్రం నందికొట్కూరుకు చేరుకుంది. సోమవారం ఉదయం సవారమ్మ, పట్టణంలోని శివాలయాలల్లో ఆ జలాలతో అభిషేకాలు చూస్తూ ప్రదక్షణలు చేస్తున్న సమయంలో వెంట వచ్చిన శునకం కూడా వారితో పాటు ప్రదక్షణలు చేసింది. దీంతో భక్తులు ఆ మల్లికార్జునుడే తమ పట్టణానికి శునకం రూపంలో వచ్చాడంటూ భక్తులు పూల మాల వేసి కాళ్లు మొక్కుతున్నారు. శునకం ప్రదక్షణలు చేస్తున్న సమయంలోనే వర్షం కూడా కురిసింది. దీంతో ఈ శునకం పేరు శివయ్య అని నామకరణం చేస్తున్నట్లు రైతు సంఘం నాయకులు రవి, భాస్కర్‌రెడ్డి తెలిపారు.


శునకానికి మొక్కుతున్న మహిళ

గుండెపోటుతో అటెండర్ మృతి


చాంద్‌బాషా (ఫైల్)

జూపాడుబంగ్లా, జూలై 15: మండల తహసీల్దార్ కార్యాలయంలో అంటెండర్‌గా పని చేస్తున్న చాంద్‌బాషా సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో గుండెనొప్పిగా ఉందని చెప్పడంతో కార్యాలయ సిబ్బంది కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కార్యాలయసిబ్బంది తెలిపారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి ఆయన మృతికి ప్రగాఢ సానుభూమి వ్యక్తం చేశారు.

ఇండియా సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎస్పీజీ విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నంద్యాల (నూనెపల్లె), జూలై 15: ఇండియా సౌత్ జోన్ అండర్ 17 బాలికల హాకీ పోటీలకు నంద్యాలలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లహరి ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్య రాజ్, పాఠశాల హెచ్ఎం జీవలత తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. జూన్ 27వ తేదీన తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి ఇండియా సౌత్ జోన్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైందన్నారు. జులై 19 నుంచి 27 వ తేదీ వరకు కేరళలో జరిగే సౌత్ జోన్ హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థిని లహరిని చాణక్యరాజ్, జీవలత, హాకీ నంద్యాల సెక్రటరీ స్టీఫెన్, సునీల్ ముత్యం ,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ అభినందించారు.

'నాడు- నేడు' అక్రమాలపై విచారణ జరిపించాలి



నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 15: వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పాఠశాలల నాడు నేడులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పాఠశాల నాడు నేడు పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం పాఠశాలలు అభివృద్ధి చేస్తామని చెప్పి మధ్యలోనే పనులను ఆపి వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందని చెప్పారు. నాడు నేడు పనులకు దాదాపు 300 కోట్లు బడ్జెట్ కేటాయించిందని అయితే ఆ మేరకు పనులు జరుగ లేదని జరిగిన చోట నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ రాజకుమారికి వినత ఇపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ వేణు, అరిఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీఎస్ రాజపత్రాన్ని రద్దు చేయాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల (నూనెపల్లె), జూలై 15: జీపీఎస్ రాజపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్‌పై ప్రస్తుత ప్రభుత్వం రాజపత్రం ద్వారా అమలు చేయాలని నిర్ణయించడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. వెంటనే గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరేష్ రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని గుర్తించండి : కలెక్టర్


కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల (కల్చరల్), జూలై 15: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 18వతేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి తిరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ పరిష్కార వేదికలో భాగంగా జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమ వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలి


మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూలై 15: విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, ఉపాధి రంగాలలో జరగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సంసిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పార్వతి పాల్గొన్నారు.

పాము కాటుకు మహిళ మృతి

వెలుగోడు, జూలై 15: వేల్పనూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(37) అనే మహిళ సోమవారం పశుగ్రాసం కోసం వెళ్ళింది. ఆసమయంలో పొలంలో లక్ష్మీదేవి ఎడమ చేతికి పాము కాటేసింది. దీంతో లక్ష్మీదేవిని నంద్యాలకు తరలించారు. నంద్యాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది, మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అద్దె చెల్లించలేదని ఆర్‌బీకేకు తాళం



శెట్టివీడులో తాళం వేసిన ఆర్‌బీకే

చాగలమర్రి, జూలై 15: మండలంలోని శెట్టివీడు గ్రామంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఆర్‌బీకేకు అద్దె చెల్లించలేదంటూ భవన యజమాని తాళం వేశారు. 6 నెలల నుంచి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయించారు. వ్యవసాయ సిబ్బంది ఖాళీ చేసి సచివాలయం చేరుకున్నారు. అద్దె చెల్లించక పోవడంతోనే ఆర్‌బీకే మూత వేసి ఖాళీ చేశామని వీహెచ్‌ఏ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. అద్దె చెల్లించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశామని, ఎరువుల స్టాక్‌ను ఏర్పాటు చేసుకునేందుకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సచివాలయ భవనం కూడా సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నామన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

బనగానపల్లె, జూలై 15: మండలంలోని కైప జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. విద్యాకమిటీ చైర్మన్ నడిపి నాగన్న ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సర్పంచ్ చిన్న లక్షమ్మమ్మ, ఎం.రామమోహన్‌రెడ్డి, షేక్ పకూర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

రుద్రవరం, జూలై 15: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ, ఏఈ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిలో రోగులకు అన్నదానం

బేతంచెర్ల, జూలై 15: పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ సభ్యుడు మారం విష్ణు మోహన్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ సాగరిక, హ్యాండ్స్ క్లబ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుర మధు, సుధాకర్ రెడ్డి, సభ్యులు చంద్రశేఖర్, వలిబాషా, మనోహర్ రెడ్డి, మహేష్, రాజు, రామకృష్ణ, శివలింగప్ప పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, జూలై 15: బనగానపల్లె మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. మండలంలోని ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి గౌతమి, నందిని ప్రతిభ చూపించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

మోడల్ స్కూల్‌లో: బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండలో వెలసిన ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి సోమవారం తెలిపారు. ఇటీవల వెలువడ్డ ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షల్లో ప్రకటించిన ఫలితాల్లో మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన మహేశ్‌బాబు, హరిణి, రిషిగణేశ్, భానుప్రకాష్, లక్ష్మీప్రసన్న ఎంపికైనట్లు తెలిపారు.

జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో.. బనగానపల్లె పట్టణంలోని జడ్పీ బాలి కల ఉన్నతపాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు హెచ్‌ఎం బాలగంగాధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. తమ పాఠశాలలో పదో తర గతి చదివిన శ్వేత, ఎస్. పర్హాన్, జి.వెంకట ప్రవళ్లిక ఐఐటీ ఇడుపాలపాయలో సీటు సాధించారన్నారు. తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

శాకంబరి అలంకారంలో గంగమ్మ

చాగలమర్రి, జూలై 15: చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధి సమీపంలో వెలసిన గంగమ్మకు మహిళలు సామూహికంగా వడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, ఆకులతో గంగమ్మను శాకంబరి అలంకారంలో కొలువుదీర్చారు. 108 దీపాలచే ప్రత్యేక హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

బేతంచెర్ల, జూలై 15: అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, ఎంఈవో సోమశేఖర్‌లకు వినతి పత్రం అందజేశారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

అవుకు, జూలై 15: కౌలు రైతులు కౌలు కార్డును పొందే విధానంపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. సోమవారం మండలంలోని శింగనపల్లె, చెన్నంపల్లె గ్రామాల్లో కౌలు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూయజమానుల దగ్గర కౌలు రైతులు సీసీఆర్‌సీ పత్రాన్ని తీసుకొని గ్రామానికి సంబంధించిన రెవెన్యూ అధికారికి అందిస్తే కౌలు కార్డును మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో అగ్రి కల్చర్ అసిస్టెంట్‌లు, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డు తప్పనిసరి

రుద్రవరం, జూలై 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే కౌలుకార్డు తప్పనిసరి ఉండాలని తహసీల్దారు మురళీమోహన్, ఏవో శ్రీకృష్ణ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

శిరివెళ్ల, జూలై 15 : టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎంపీపీ, మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ రఘురాముడు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన మృతదేహానికి శ్రీకాంత్‌రెడ్డి పూలమాల వేసి సోమవారం నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురళి, గ్రామ నాయకులు రామాంజనేయ రెడ్డి, కృష్ణమూర్తి, భూపాల్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, జార్జి, పలువురు కార్యకర్తలు రఘురాముడు మృతదేహానికి నివాళి అర్పించారు.

ఉపాధితో అన్నదాతకు ఊతం

- కూటమి ప్రభుత్వంతో మరోసారి వేగంగా ఫారం పాండ్స్ తవ్వకాలు
- జిల్లాలో 800 నిర్మాణాలకు ఉపాధి అధికారుల ప్రణాళిక



పేట్నికోటలో ఫారంపాండ్ పనుల్లో నిమగ్నమైన ఉపాధి కూలీలు

కొలిమిగుండ్ల, జూలై 15: ఉపాధి.. ఇక అన్నదాతకు ఊతంగా మారనుంది. రైతులకు మరింత అండగా నిలవడానికి చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చేపట్టగానే ఉపాధి పథకాన్ని ఉద్యానవన పంటలకు అనుసంధానం చేస్తూ మొదటి రోజే సంతకం చేశారు. ముఖ్యంగా వర్షపు నీటిని వడిసి పట్టే విధానాలను ప్రవేశపెట్టడంలో తనదైన మార్కు. ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు పెరిగే ఫారంపాండ్స్(ఇంకుడు గుంతలు) ప్రక్రియకు మరో సారి ప్రాధాన్యత ఏర్పడింది. సీఎం చంద్రబాబు గత పాలనలో సైతం వర్షపు నీటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు, కందకాలు, చెరువుల్లో పూడిక తీత తదితర అనేక కార్యక్రమాలు చేపట్టారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఉపాధి నిధులన్నీ పక్కదారి మళ్లించి, సచివాలయ భవనాలు, ఇతర అవసరాలకు వాడుకున్నారు. దీంతో కూలీలకు పనిలేక పోవడం, చేసిన పనికి కూలి రాకపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఉపాధి కూలీలకు, రైతన్నలకు ఊరట కలిగించే అంశంగా మారింది. జిల్లాలోని మెట్ట పంటలు సాగుచేసే ప్రాంతాలే లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది 800పైగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఉపాధి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయా మండలాల ఏపీవోలకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనేక గ్రామాల్లో ఇప్పటికే రైతుల పొలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు. 5 ఇంటు 5, 10 ఇంటు 10, 20 ఇంటు 20 సైజు విస్తీర్ణంలో ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. రైతుల పొలం విస్తీర్ణం, వారి ఆసక్తిని బట్టి అధికారులు చర్యలు చేపడుతున్నారు. సైజుల వారిగా రూ.50వేల నుంచి రూ.3లక్షల వరకు ఈ ఇంకుడు గుంతలకు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇవి పూర్తయితే మెట్ట రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు.

వేగంగా ఫారంపాండ్స్ తవ్వకాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మెట్ట ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో ఫారంపాండ్స్(పంట కుంటలు) తవ్వకాల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. మా పరిధిలో ఇప్పటికే 220 కుంటల తవ్వకాలు పూర్తి చేశాం. ఈ అవకాశాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి.

- సాంబశివుడు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్

నాడు-నేడు అక్రమాలపై విచారణ జరపాలి



నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బేతంచెర్ల, జూలై 15: గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయించిన నాడు-నేడు పథకం బడ్జెట్ విడుదల, నిధుల వినియోగం, పనుల పెండింగ్‌కు వెనుక జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షుడు పవన్ అధ్యక్షత వహించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ నాడు-నేడులో అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సతీస్, వేణు, సందీప్, ఆరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 15: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కో-ఆర్డినేటర్ దస్తగిరిబాష తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని అన్నారు. రహదారుల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు.

క్షుద్ర పూజల కలకలం



వంతెన కింద క్షుద్ర పూజల గుర్తులు

ఉయ్యాలవాడ, జూలై 15: మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలోని కుందూ నది వంతెన కింద క్షుద్ర పూజలు కలకలం లేపాయి. సోమవారం ఉదయం వంతెన కింద పసుపు, కుంకుమలతో దీర్ఘచతురస్ర ఆకారం చేసి అందులో కొన్ని ఆకారాల బొమ్మలు గీచి పూజలు చేసిన ఆనవాలను రజకులు గుర్తించారు. అక్కడ ఓ దిష్టిబొమ్మను కూడా కాల్చివేసిన అనవాలు కనిపిస్తున్నాయి. క్షుద్ర పూజల వాసన రాకుండా అక్కడ సెంటు ఉంచారు. ఈ సెంటు వాసన దాదాపుగా పది మీటర్ల దూరం వస్తుంది. ప్రతి రోజు ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల ప్రజలు స్నానాలకు వెళ్తుంటారు. క్షుద్ర పూజల ఎలాంటి ఆపద వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఘనంగా స్వాతి వేడుకలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాద వరద స్వామి

ఆళ్లగడ్డ, జూలై 15: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆణి జ్యేష్టాభిషేకం వేడుకలను వేదపండితులు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీపెరియాళ్వార్ తిరునక్షత్రం పురస్కరించుకొని ఉదయం ప్రహ్లాద వరదస్వామి గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగగా పరతత్వ నిర్ణయం చేసి వేద మంత్రాలను పెరియాళ్వార్ పాశురాలను విన్నవించారు. అనంతరం స్వామి వారికి ఆలయ రంగ మండపంలో విశేష జ్యేష్టాభిషేకం నిర్వహించారు. స్వామి వారి స్వర్ణ కవచాలను తీసి వేసి స్వయం తిరుమేనికి పాలు, పెరుగు, పన్నీరు. పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన పావన నరసింహస్వామి దేవస్థానంలో సోమవారం స్వాతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం తులసీదళాలతో అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నరసింహమూర్తి, సుజాత, గురమ్మ, చిన్న, సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

బేతంచెర్ల, జూలై 15: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన తలారి మధుశేఖర్(26) అనే ఫ్యాక్టరీ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం చోటు చేసుకుంది. తలారి మధుశేఖర్ ఓ ఫ్యాక్టరీలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స మొదలుపెట్టేలోపే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మధుశేఖర్ మృతితో ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్యాపిలి, జూలై 15: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బలరాముడు అన్నారు. సోమవారం మండలంలోని బావిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆవుపేడతో దశకర్ణ కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

బాలికల రక్షణే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 15: బాలికలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో వెలుగు రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, విద్యార్థినులను పాఠశాలలో అందిస్తున్న ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయి? ఉదయం ఏమి తిన్నారు? విద్యా బోధన ఎలా ఉంది? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని వంట గదిని, స్టాకు వివరాలను, విద్యార్థినిలకు మధ్యాహ్నం అందించే వంటకాలను రుచి చూసి వీటిని పిల్లలకు ఇంకా రుచిగా వడ్డించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థినులకు సరఫరా చేసే బియ్యం మంచిగా ఉండాలని తహసీల్దార్ నజీర్ అహమ్మద్‌కు సూచించారు. పాఠశాలలో నెలకొన్న మంచి నీటి ఎద్దడి నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కమిషనర్ రమేష్‌బాబును ఆదేశించారు. పాఠశాలల్లో పని చేసే సిబ్బందికి జీతాలు కలెక్టరుతో మాట్లాడి ఇప్పిస్తానని అన్నారు. ఆమె వెంట నాయకులు హుసేన్‌బాషా, శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయినులు ఉన్నారు.

సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కేసీ ఆయకట్టు రైతులకు సాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అఖిల ప్రియ కేసీ అధికారులను ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో సోమవారం కేసీ డీఈ, ఏఈలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేసీ పంటకాలువలు, తదితర వాటి నిర్మాణానికి నిధుల కోసం వివరాలను తెలపాలని ఆమె అధికారులను కోరారు. కేసీ ఆయకట్టు రైతులు ఏ ఒక్కరు తన పొలానికి సాగు నీరు అందలేదన్న ఫిర్యాదు రాకుడదని ఆమె అన్నారు. వచ్చే నెలలో కేసీ కాలువకు నీటి సరఫరా జరిగే అవకాశం ఉందని, ఈలోగా ఎక్కడైన పనులు చేయాల్సి ఉంటే వెంటనే వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

కల్వర్టులకు ర్యాంపుల ఏర్పాటు

సొంత డబ్బు వెచ్చించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 15: బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, మదర్‌థెరిసా చర్చి ఎదురుగా ఉన్న 4 కల్వర్టులకు సొంత డబ్బుతో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ ర్యాంపులు నిర్మిస్తామని ఆయన ఆదివారం హామీ ఇచ్చి సోమవారం ఏర్పాటు చేశారు. పట్టణంలో ఆదివారం పలు కాలనీల్లో బీసీ రాజారెడ్డి పర్యటించిన సందర్భంగా బీసీ కాలనీ, ఎస్సీకాలనీ, మదర్ థెరిసా కాలనీల్లో సీసీ రోడ్లకు కల్వర్లు, సీసీ రోడ్డులు ప్రధాన రహదారికి ఎత్తుగా ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తా అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రధాన రహదారిలో సీసీ రోడ్డుకు సొంత ఖర్చులతో 4 ర్యాంపులు వేసి సమస్యను పరిష్కరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, జూలై 15: మండలంలోని గొడిగనూరు గ్రామంలో సోమవారం వైద్యులు తస్లీమ్ సుల్తానా ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా, మెదడువాపు, అతిసార వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో వెంకటమ్మ, ఏఎన్‌ఎంలు విజయకుమారి, చెంచులక్ష్మి, విద్యార్థులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

డోన్(రూరల్), జూలై 15: డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు పేద విద్యార్థినికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్యాపిలి మండలం పీఆర్‌పల్లె గ్రామానికి చెందిన అమృత అనే పేద విద్యార్థిని ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 567 మార్కులు సాధించింది. శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఈ పేద విద్యార్థినిని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని సురేష్ అనే యువకుడు తన పాత స్నేహితులు ఆదినారాయణ, మద్దయ్య ద్వారా పాఠశాలకు వెళ్లి ఆ విద్యార్థినికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. చదువులో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని అమృతను పాఠశాల యజమాన్యంతో కలిసి సత్కరించి అభినందించారు.

గురుకుల పాఠశాలలో డొనేషన్లు వసూలు

బనగానపల్లె, జూలై 15: బనగానపల్లె పట్టణంలోని జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో చేరాలంటే డోనేషన్లు వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో మిగులు సీట్లకు బేరం పెట్టి వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు, విద్యార్థులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి 10 వరగతి వరకు చదువుకుంటున్నారు. పేద బడుగు బలహీన వర్గాల వారు ఈ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తుంటారు. అయితే ఇక్కడ పనిచేసే పాఠశాల హెడ్ గురుకుల పాఠశాల అభివృద్ధి కోసం అంటూ డొనేషన్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. వంటపాత్రలు, ఫర్నీచర్ కోసమని వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పాఠశాల అభివృద్ధి కోసం: ప్రిన్సిపాల్ బాలాజీ

గురుకుల పాఠశాలలో విద్యార్థులతో డొనేషన్లు వసూలు చేయడం లేదు. పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల సౌకర్యం కోసం, వారి సంక్షేమం కోసమే నిధులు విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ఇస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్‌ఐ

సంజామల, జూలై 15: ఆర్టీఏ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆల్వకొండ క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. రూట్ పర్మిట్, ఇన్సూరెన్స్, యూనిఫాం, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లను ఆపి తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేని 30మందికి జరిమానా విధించారు

నేలబిలంలో విశేష పూజలు

కొలిమిగుండ్ల, జూలై 15: మండలంలోని నేల బిలం మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, ప్రసాద వితరణ చేపట్టారు. సోమవారం కావడంతో ఉమ్మడి కర్నూల్ జిల్లాతో పాటు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పలువురు భక్తులు నేలబిలం మల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారం కోసమే మీకోసం

చాగలమర్రి, జూలై 15: సమస్యల పరిష్కారం కోసమే మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులచే ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. రైతులు పాసు పుస్తకాలు, అడంగల్, భూ సమస్యల పరిష్కారం కోసం వినతులను అందజేశారు. ఎంఈవో అనూరాధ, ఏవో రంగనేతాజీ, ఏఈ షాజహాన్, సర్వేయర్ మద్దిలేటి పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం



రుద్రవరంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



బనగానపల్లెలో పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూలై 15 : మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, వెలగలపల్లె, యల్లావత్తుల, శ్రీరంగాపురం, తువ్వపల్లె, నాగులవరం, కొండమాయపల్లె ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున పీర్లను గ్రామోత్సవం చేశారు ఇంటింటి వద్ద భక్తులు ఫాతెహాలు చేశారు. కన్నుల పండువగా గ్రామోత్సవం చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో కొలువుదీరిన అలిఅక్బర్ పీరును సోమవారం గుర్రంపై కొలువుదీరింప చేసి ధివిటీల మధ్య వీధుల గుండా ఊరేగించారు. అనంతరం గుర్రంపై పీరును ఊరేగిచారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా, టీడీపీ నాయకులు అమీర్, అజిముద్దిన్, మౌలాలి, అనిఫ్, శ్యాబుల్, షఫి, ఆరిఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని కొండపేట జెండా కట్ట వీధిలో కొలువుదీరిన ఇమామ్‌కాశీం పీర్లచావిడిలో చిన్నసరిగెత్తు నిర్వహించారు. అగ్ని గుండం చుట్టూ భక్తులు చిందులు వేశారు.

బనగానపల్లె: మండలంలో మధ్య సరిగెత్తు వేడుకలు సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామాల్లో పీర్ల చావిడి వద్ద గుండాన్ని కట్టెలతో మండించి కర్బాలా మైదానంలో అసువులు బాసిన వీరులను ఇమాంహుస్సేన్, ఇమాంకాశీం తదితరులను స్మరించుకున్నారు. భక్తులు పీర్లచావిడి వద్దకు వచ్చి దట్టీలు, పూలచద్దర్‌లు, చెక్కెర, లడ్డూలు ఇతర తీపి పదార్థాలతో పాటు వెండి వస్తువులు పీర్లకు భక్తి ప్రపత్తులతో సమర్పించారు. బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం బంగారు పీర్ల వద్ద మధ్య సరిగెత్తు వేడుకలు సోమవారం రాత్రి సంప్ర దాయబద్ధంగా నిర్వహించారు.

బేతంచెర్ల: పట్టణంలోని పీర్ల చావిడిలలో వెలసిన పీర్లకు ఆదివారం అర్ధరాత్రి చిన్న సరిగెత్తు నిర్వహించారు.

సంజామల: మండలంలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకల్లో భాగంగా మధ్య సరిగెత్తు నిర్వహించారు. సంజామల కోట వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీర్లకు బనగానపల్లెకు చెందిన షియా కుటుంబీకులు మధ్య సరిగెత్తు వైభవంగా నిర్వహించారు.



సంజామల కోట వీధిలో..



చాగలమర్రిలో..



డోన్‌లో..

వ్యర్థాల తొలగింపు



ఎక్స్‌కవేటర్ సాయంతో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ, జూలై 15: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మురుగు కాలువ వెంట ఉన్న వ్యర్థాలను తొలగించారు. సోమవారం మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు చేపట్టారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల సహాయంతో వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సిరెడ్డి ఉన్నారు.

భర్తపై కేసు నమోదు

బేతంచెర్ల, జూలై 15: మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన దూదేకుల ఆశాబీని భర్తతోపాటు మరో నలుగురు వేధింపులకు గురి చేస్తున్నారని కేసు నమోదైందని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఆశాబీని భర్త సిద్దయ్య, బావ ఇమాం కాశీం, మరో ముగ్గురు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆశాబీ భర్త సిద్దయ్య అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, భార్యని భర్త సిద్దయ్య, మరో మహిళతోపాటు మరో ముగ్గురు వేధింపులకు గురి చేయడంతోపాటు కొట్టి గాయపరిచారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్తతో పాటు మరో నలుగురిపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.